# నిన్న కాని రేపటి రోజు

జయంతి వెంకట రమణ



(గత సంచిక తరువాయి)

"నెలానెలా ఎత్తిపంపటంతో మొదట సుఖం అనిపించినా, చేతల్లోకి వచ్చేసరికి కష్టం అనిపిస్తుంది. నామట్టుకి నాకు 600 రూ॥ జీతం అందుతున్నా, అప్పుచెయ్యని నెలలేదు. డాక్టర్లు, మందులు, పిల్లల పుస్తకాలు, డ్రస్సులు, స్కూలుజీతాలు, ఆఫీసులో కట్టింగులు అన్నీపోగా మిగిలినది అటామటి. అందుచేత ప్రతీ నెల

ఎత్తిపంపటం కష్టం రాజూ. అందుచేత అమ్మ ఒకరి దగ్గర, నాన్న మరిఒకరి దగ్గర ఉండటం సుఖమైన పని. శుభ కార్యాలకి కలుస్తూంటాం కదా. ఏమం టావు ?" అన్నారు శేఖరు.

"నిజమే" అన్నాడు రాజు.

"కాని ఎవరు ఎవరిదగ్గ రుండాలి అన్నదానికి నీకే వదిలిపెడుతున్నా. నాన్నగారిది పెద్దవయసు. ఆయన వెనుక ఎవరో ఒకరు ఉండాలి. మరి మరదలు రాజేశ్వరి చాలా అర్భకురాలు. మళ్ళా ఇప్పుడు అనుమానంగా ఉందని మీ వదినతో అందట. ఏమైనా ముగ్గురు పిల్లలతో ఆపుచేసేయి. అమ్మను నీవే అట్టి పెట్టుకో. ఇదీ మూడవ కాన్పు కదా. మీ అత్తవారు పురుడు పొయ్యరు. కాబట్టి అమ్మ ఉంటే నీకు ఆసరాగా ఉంటుంది. మరి మా పిల్లలు కొద్దిగా ఎదిగారు కదా. నాన్నగా రేమంత సమస్య మాకు కారు. ఆలోచించు. నా నిర్ణయం నచ్చకపోతే అమ్మ నాదగ్గర ఉంటుంది. నాన్నగారిని మాత్రం నీవు జాగ్రత్తగ చూచుకోవాలి."

"వదిన ఈ ఏర్పాటుకు ఏమంటుందో" నసిగాడు రాజు.

"నేను మీ వదినతో ఈ విషయాలన్నీ మాటాడాను. మీ వదిన కాదనదు."

"అయినా నేను రాజీతో ఒకసారి చెప్పాలి కదా. రాజీ ఏమంటుందో."

"మీరు కూడా ఆలోచించుకోండి. నాన్నగారు మనల సమావేశపరిచేసరికి ఇద్దరమూ ఒకే మాటమీద ఉండాలి. అదే నా ఉద్దేశ్యం."

రాజు చాలా తొందరగా తన గదిలోకి వెళ్ళాడు. రాజేశ్వరిని పిలిచి అత్యవసర సమావేశాన్నేర్పాటు చేశాడు. ఆమె రాజు చెప్పినదంతా విన్నది.

"మీ అమ్మగారు వచ్చి మనతో ఉంటే మరి మా అమ్మ ఎక్కడి కెళ్ళేటట్టు ? మా అమ్మపొడ మీ అమ్మగారికి పడదు కదా !" అందామె.

రాజు ఆలోచనలో పడ్డాడు.

"అయినా మా అమ్మనే పంపేస్తా లెండి. దానికేం ఇల్లూ వాకిలీ లేదా ! పరాయి యింట ఉండే ఖర్మ దానికేం పట్టింది ?"

"అనవసరంగా కన్నీ రెందుకు ? ప్రస్తుతం చేయవలసినదాని గురించి ఆలోచించక" విసుకున్నాడు రాజు.

ఇక ఆలోచించేదేముంది ? అమ్మను నేనే రమ్మన్నాను. నేనే పొమ్మంటాను. వాళ్ళిద్దరి మధ్య సామరస్యం కుదరదు. వాళ్ళ మధ్యన నేను నలిగిపోలేను. ఈ మాత్రం ఆరోగ్యం కూడా ఉండదు" ముక్కు చీదుకుంది రాజేశ్వరి.

రాజు మాటాడలేక పోయాడు. అతడి మౌనం రాజేశ్వరికి ధైర్యాన్నిచ్చింది. నెమ్మదిగా కన్నీరు తుడుచుకుంటూ—

"మామగారి మీద మీఅన్నగారి కెందు కంత ప్రేమో మీరు గ్రహించలేక

పోయారు. ఆయన తనతో ఉంటే మామ గారి పెన్షను డబ్బులు తనకే అందు తాయి. తండ్రిని దగ్గరుంచుకున్నాడన్న పేరూ దక్కుతుంది. మీ అమ్మగారు నా దగ్గరుంటే నేనామెకు చెయ్యలేను. ఆమెచేత చేయించుకోలేను. అత్తగారి చేత కోడలు చేయించుకుంటున్నదన్న పేరు నాకు దక్కుతుంది. మీరు నోరు లేని అమాయకులవబట్టే అందరి ఆటలు సాగుతున్నాయి" ధర్మసూక్ష్మ న్నెఱుగ పలికింది రాజేశ్వరి.

రాజుకు నెమ్మదిగా జ్ఞానోదయం కాసాగింది.

"అయితే ఇప్పుడు నన్నేం చేయ మంటావు ?" అడిగాడు కర్తవ్యం రాజు.

"నాకేంతెలియదు" అందామె బుంగ మూతి పెట్టుకుని.

"అలాగంటే ఎలాగ ? ఈ మాట కోసమా నిన్నడిగింది నేను ?"

"మీ అమ్మగారిచేత చేయించు కోవటం నాకిష్టంలేదు. ఆమెకు చేసే శక్తి నాకులేదు. తరువాత మీ యిష్టం" చెప్పేసింది రాజేశ్వరి.

"పోనీ అమ్మను అన్నదగ్గరుండ మంటాను. నాన్ననైనా తెచ్చుకుందాం."

రాజేశ్వరి మాటాడలేదు.

రాజు ఎక్కువసేపు అక్కడుండక వచ్చినంత వేగంతో శేఖర్ దగ్గరకెళ్లాడు.

"నాన్నగారిని నేనే ఉంచుకుంటాను" అన్నాడు వేగంగా.

"నాన్నగారికి అనకాపల్లి నీరుపడదు" అన్నాడు శేఖర్.

రాజు ఏదో అనబోతుండగా పెద్ద అక్కగారటు రావటంవల్ల వారి ప్రసంగం ఆగిపోయింది.

మధ్యాహ్నం కాఫీలవేళ రాజు నెమ్మదిగా అన్నాడు. "ఈ రాత్రి బయలు దేరి వెళ్ళాలనుకుంటున్నాను నాన్న గారూ !" అని.

"అలాగా !" అంటూ శేఖర్ వైపు చూశారాయన.


శేఖరు నెమ్మదిగా కాఫీ సిప్‌చేస్తూ "మీ రెందుకో ఉండమన్నారు కదా !" అన్నాడు.

"అవును. మీ పెద్దక్కను, సుమను ఒకసారి పిలువు" అన్నారాయన.

రాజు వారల పిలిచేందుకు పరుగెత్తాడు.

కొద్దిసేపటిలోనే వాళ్ళు వచ్చారు. వాళ్ళ వెనుక ఇద్దరు కోడళ్ళూ ఆత్రంగా వచ్చారు. సీతారామయ్యగారందర్నీ చూచి "కూర్చోండి" అన్నారు.

ఆ చాపమీదే అందరూ సర్దుకుని కూర్చున్నారు. ఆయన కాఫీ గ్లాసును ప్రక్కన ఉంచుతూ "సుభద్రా, శేఖరు, రాజూ, సుమా, మీరందరూ పెద్దవాళ్ళు, వ్యక్తులు. మీ యిళ్ళు మీకు ఏర్పడ్డాయి. సుభద్ర పెళ్లిదగ్గరనుండి, సుమ పెళ్లి వరకు అందరూ కుటుంబాలతో ఎన్నో సందర్భాలుగా రావటం, అందరం కలిసి ఉండటం, మీరందరూ వెళ్లేలోగా మీ




అందరికీ నాకు తోచినది శక్తి వంచన లేకుండ యిస్తూండటం జరుగుతూ వస్తోంది, ఇంతవరకు. మీ రెన్నిరోజులు వారాలు ఉన్నా నాకు బాధ అనిపించలేదు. కాని పరిస్థితులు మారాయి. నేను నిరుద్యోగి నిప్పుడు..." అందరూ ఆయన మాటల మీదే దృష్టి కేంద్రీకరించారు.

"శక్తి ఉన్నా నే నశక్తుడనయ్యాను. పిలిచి ఆదరించే స్థోమత నాకు లేదు. కాని నాకు మాత్రం మీరందరూ రావాలని, ఆనందంగా ఈ యింట్లో తిరగాలని ఉంది." మళ్లా ఆగారు. ఇంటి నాలుగు గోడలవైపు కలయచూచి–

"కాని ఈ యింటిలో మనం కలిసి తిరిగే అవకాశం నాకు కనిపించటంలేదు. ప్రస్తుతం ఈ ఇల్లు తణఖాలో ఉంది" మళ్లీ ఆగారు.

"సంవత్సరమై యిల్లు తణఖాలో ఉన్నా అద్దె యిచ్చుకుంటూ, స్వంత యింటిని వదలలేక గడుపుకుంటూ వచ్చాను. ప్రావిడెంటు ఫండు నెల రోజుల క్రితమే వచ్చింది. ఆ సొమ్ముతో ఇంటిని విడిపించుదామనుకున్నాను. కాని చాలా కాలంగా రంగయ్య దగ్గర పెరిగి పోయిన అప్పు తీర్చటానికే అది అటామటి అయింది. అందుకని ఈ ఇంటిని విడిపించటం కాలేదు. ఇక ఈ ఇంటిలో ఉండే అవకాశమూ లేదు. ఇంటిని ఖాళీ చేయమని రెండు నెలల నుండి అడుగుతున్నాడు. అందుచేత ఇంటిని ఖాళీచేయక తప్పదు. ఇంటిని అమ్మటం నా కిష్టం లేదు. ఎలాగైనా స్వంతం చేసుకోవాలి. అదే నా ధ్యేయం" అంటూ ఆగి రాజు, శేఖర్‌లవైపు చూశారు. ఇద్దరూ ముఖ ముఖాలు చూచుకున్నారు. కళ్ళజోడును తుడుచుకోవటం ముగించి కళ్ళజోడు

పెట్టుకుని "సుమారు నెలరోజుల క్రితమే నేనీ విషయాన్ని మీకు వ్రాద్దామను కున్నాను. కానీ మీ సంసారాలు పెరిగాయి. మీ బాధ్యతలు కూడా పెరిగాయి. అందు చేత మీరేమీ చేయలేరని గ్రహించే మీకు వ్రాయలేదు" అంటూ ఇంకా ఏదో చెప్ప బోతుండగా పెద్దమ్మాయి కలుగజేసుకుని "అయితే మీ నిర్ణయం ఏమిటి నాన్న గారూ ?" అని అడిగింది.

"మీ కెవరికీ బరువవటం నా కిష్టం లేదమ్మా ! నాకు ఉద్యోగం దొరికింది. ఈ ఊరు వదలి వెళ్తున్నాము నేనూ, మీ అమ్మా."

"నాన్నగారూ ! మీ రిలా అనటం భావ్యంకాదు. మేము నలుగురం మీ సంతానం. మీరు మా ఎవరి దగ్గరుంటే మీకు గడిచిపోదు? మీరెంత కాలం ఎక్కడున్నా కాదనేవారెవరు? తమ్ముళ్లే మనకాక్కరంటే నా దగ్గరే మీరూ అమ్మా వచ్చి ఉండిపొండి. ఆ లంకంత ఇంటిలో నేను, ఆయన, ఇద్దరు పిల్లలేకదా !" అందామె.

"నాకు తెలునమ్మా ! నా పిల్లలు నన్ను పోషించలేని అసమర్థులు కారు. కాని నేననే దదికాదు. నేను పనిచేయాలి. ఇంటిని స్వంతం చేసికోవాలి. మన మందరం ఇంటిలో కలిసి తిరగాలి. అందుకనే నేను ఉద్యోగం చేయదలచు కున్నాను. నాకు ఉద్యోగం దొరికింది. రాష్ట్రంకాని రాష్ట్రమైనా దూరమైనా స్వతంత్రంగా జీవించే అవకాశం ఉంది కనుక వెళ్ళదలచుకున్నాను. వెళ్తున్నాను నేనూ మీ అమ్మకూడ. ఈ సందర్భంలో నేను శేఖరుకు చెప్పవలసిన దొకటుంది" అని ఆగాడు.

"ఏమిటి నాన్నగారూ !" అన్నాడు శేఖరు భక్తిప్రపృత్తులతో.

"నేను వెళ్లేది చాల దూరప్రాంతానికి. అనుకున్నప్పుడల్లా రావటం కుదరదు. ఇంటిని విడిపించే రోజునే వస్తాను.అంత వరకు అందరూ ప్రతి సంక్రాతికీ శేఖరు యింటిలో కలియాలి. అందరినీ పిలిచి ఆదరించే బాధ్యత శేఖరుది. సంవ త్సరాని కొకసారి. శేఖరు ఇంటిలో. బట్టలకు డబ్బు నేనే పంపుతాను. ఈ పనిని శేఖరుకు ఒప్పచెప్పటం కోసమే మీ అందరినీ ఉండమన్నాను. మి అందరి బాధ్యత శేఖరుకు ఒప్పగిస్తున్నాను. నేను తిరిగి వచ్చి ఇంటిని విడిపిస్తాను" ముగించారాయన.

"మీరు ఎవరి మాటా వినరు. మీ మాటే మీది. మీరంత దూరం వెళ్ళటం నా కిష్టంలేదు" అన్నాడు శేఖరు.

"నాన్నగారికి మన మీద నమ్మకం పోయిన తరువాత మన మేమనుకున్నా ప్రయోజనం లేదన్నయ్యా !" అన్నాడు రాజు.

"శక్తి ఉన్నంతవరకు పనిచేయటమే ప్రతీవారి విధి రాజూ !" అన్నారాయన.

"ఇంతవరకు మీరు మా కోసం

ఎంతో చేశారు. ఇంకా చెయాలను కోవటం పిచ్చితనమే నాన్నగారూ! తమ్ముళ్ళిద్దరూ ఇంటిని విడిపించే బాధ్యత పడితే మీరూ అమ్మా మా యింటిలోనే ఉండవచ్చు. ఆడపిల్లలు, మగపిల్లలు వేరు అనే దృష్టితో చూడకండి నాన్న గారూ!" అంది పెద్దమ్మాయి.

"ఆ మాత్రం తిండి తల్లిదండ్రులకు పెట్టలేని అసమర్థులంకాము అక్కయ్యా. ఆ ఉంచుకునేదేదో మా దగ్గరే ఉంచుకో గలం. నాన్నగారి మనసు ఉద్యోగం మీద ఉంది. ఆయనను మనం ఆపలేము. నేను నిజం చెప్పాను. మీరేమనుకున్నా సరే" అన్నాడు రాజు.

"నీ వన్నది నిజం రాజూ! నాకు పని చెయ్యాలని ఉంది. నే చేస్తాను. నాకు ఆడపిల్లలూ మగపిల్లలూ అంతా ఒకటే. అందుకనే అందరికీ చదువులు చెప్పించాను. గ్రాడ్యుయేట్సుచేయించాను. అప్పులు అవుతున్నా భయపడలేదు. మగ పిల్లలకి ఉద్యోగాలు చేయవలసి వచ్చింది కనుక వారు చేస్తున్నారు. ఆడపిల్లలకి ఆ అవసరం రాలేదు. అందరికీ మంచి సంబంధాలే తెచ్చి పెళ్ళిళ్ళు చేశాను. మీ భవిష్యత్తు నా బాధ్యత. బాధ్యతలు మిగిలిపోయిన కారణంచేతనే నేను ఉద్యోగం చెయ్యాల్సి వస్తోంది. మీరు నాలాగ కాక ఉద్యోగం నుండి రిటైర్ అయ్యేనాటికి మీ బాధ్యతల నుండి విముక్తులు కండి. ఎవరికైనా నే చెప్ప గలిగేది ఇంతే."

"రాజూ! ఆయన బాగా ఆలోచించే ఈ నిర్ణయం చేశారు. ఆయన మనసు మీరు గ్రహించలేదు. నాన్నగారు చెప్పి నట్టు మీ రందరూ పండుగకు కలియండి. మీమీ ప్రయాణాలకు ఏర్పాట్లు చేసి కోండి. వెళ్ళండి." అంటూ లేచిపోయారు రాధమ్మ.

ఆమెతోపాటు ముఖాలు దీనాతిదీనంగా ఉంచుకుని లేచిపోయారు రాజు, శేఖరు. ఆ రాత్రే వాళ్ళు కుటుంబాలతో రైలు ఎక్కారు.

అందరూ వెళ్ళిపోయిన తరువాత సుమ నెమ్మదిగా తండ్రిదగ్గరకెళ్ళి అంది "నాన్నగారూ! పిల్లలు తల్లి దండ్రుల బాధ్యతలేగాని, హక్కులు కారా?"

"ఎందుకు కాదమ్మా! ప్రతి తల్లి దండ్రులు ముసలికాలంలో పిల్లలదగ్గరే గడపాలని కోరుకుంటారు. కాని నేను రిటైర్ అయి సంవత్సరం అవుతున్నా ఈ కొడుకు లెవ్వరూ రమ్మని పిలవ లేదమ్మా! అంతేకాదు, బ్రతికిఉన్నామో చచ్చామో అని తొంగిచూడలేదు. జీతం లేక సంవత్సరంపాటు ఎలా గడిపామో మాకే తెలుసు. పెళ్ళిళ్ళకు వాళ్ళు తెచ్చుకున్న కట్నాలలో పెళ్ళి ఖర్చులు పోగా, మిగిలినది వాళ్ళే తీసుకున్నారు. మీ కందరికీ తెలుసు. వాళ్ళకు చదువు

చెప్పించటంలో చేయాల్సి వచ్చిన అప్పులను నిన్న మొన్నటివరకు తీర్చుతూనే ఉన్నానమ్మా! వాళ్ళకా విషయం తెలియదా? వీళ్ళు మా ముసలికాలంలో చూస్తారని ఎలా అనుకోను?" అగాడాయన.

సుమ ఏదో అడగబోతుండగా—

"నన్ను, మీ అమ్మను చెరొకరు పంచుకో నిర్ణయించుకున్నారమ్మా మీ అన్నలు. నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా! నేను వారి సంభాషణ అంతా విన్నాను. నాకు వినవలసివచ్చింది. నాకు పెన్షను వస్తుంది కనుక శేఖరు నన్ను చేరదీయటానికి, చాకిరీ చేస్తుంది కనుక మీ అమ్మని రాజు చేరదీయటానికి నిర్ణయం. అప్పటికీ వాళ్ళు సరియైన నిర్ణయానికి రాలేదు. అందుచేతనే ఇంటిని అద్దెకిచ్చి దూరంగా వెళ్ళిపోతున్నాను."

"అద్దెకిచ్చా?"

"అవును. ఇంటిని తణఖా పెట్టలేదు. కాని వాళ్ళలో ఏమైనా చైతన్యం ఉంటుందేమో అని కడసారి ప్రయోగించేశాను. కనీసం ఇంటిని విడిపించే బాధ్యతనైనా మేము పడతాము అన్నమాటనెవరూ అనలేదు. వాళ్ళా మాటనని ఉంటే నేనిక్కడి నుండి కదిలేవాడనుగాను. ఇప్పుడు నా యింటిమీద వాళ్ళంతట వాళ్ళే హక్కు లేకుండా చేసుకున్నారు. అది నిరూపించటంకోసమే ఒక సంవత్సరంపాటు దూరంగా వెళ్ళిపోతాను. ఇంటిమీద ఎంత అప్పుఉంది అని అడగనివారికి అప్పును నేనెలాతీర్చినదీ తెలియనక్కరలేదు. నా తరువాత ఇంటి నెవరికివ్వాలనేది; ఈ విశాలప్రపంచంలో దైన్యపరిస్థితిలో ఎన్నో కుటుంబాలుండగా అది నాకొక సమస్య కాదు."

"పట్టుదలకోసం మీరు దూరంగా వెళ్ళిపోవాలనుకుంటున్నారు. కాని నాదొక మాట. ఆడపిల్లలు, మగపిల్లలు మీకు ఒకటే కదా! నా దగ్గరకు మీరిద్దరూ వచ్చి ఉండకూడదా? నేను ఉద్యోగం చేస్తున్నాను కదా!" అంది సుమ.

"అందరూ నాకు ఒకటేనమ్మా బాధ్యతల విషయంలో. హక్కుల విషయంలో మాత్రం కాదు. మిమ్మల్ని సుఖపెట్టటం మా బాధ్యత. మీరు సుఖపడితే సంతోషించటం మా హక్కు. ఈ సూత్రం ఆడపిల్లల విషయంలోనే వర్తిస్తుందని అనుకునేవాడిని. ఇప్పుడు మగపిల్లల విషయంలోకూడా చక్కగా వర్తిస్తుందని తెలిసికున్నాను. రోజులు మారాయి" అన్నారు అయన కండువాతో కళ్ళజోడు తుడుచుకుంటూ.

సుమ మాటలు లేనిదైంది.

---